సాక్షి
మహబూబాబాద్
ఆదివారం । 8 । అక్టోబర్ । 2023



కేసీఆర్ పాలన ఆదర్శం..
సీఎం కేసీఆర్ పాలన దేశానికే ఆదర్శమని, కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో నబ్బండవర్గాల ప్రజలు సంతోషాలతో ఉన్నారని మంత్రి దయాకర్‌రావు అన్నారు. - 8లో▸



ఆర్ట్స్ కళాశాలలో గొడవ
హనుమకొండ ఆర్ట్స్ కళాశాలలో విద్యార్థుల మధ్య గొడవ జరిగింది. దీంతో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. - 8లో▸

గరిష్టం/కనిష్టం
33^0 /25^0

వాతావరణం
జిల్లాలో ఉదయం నుంచి ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఎండ మామూలుగా ఉంటుంది. సాయంత్రం చలిగా ఉంటుంది

న్యూస్‌రీల్

ఆశలకు రూ.18వేల వేతనం చెల్లించాలి



నెహ్రూసెంటర్: పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఆశాకార్యకర్తలకు రూ.18వేల వేతనాన్ని చెల్లించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కాసు మాధవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో సూపరింటెండెంట్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాసు మాధవి మాట్లాడుతూ రూ.18వేల వేతనంతో పాటు ఈఎస్‌ఐ, పీఎఫ్, బీమా సౌకర్యం కల్పించాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆశల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకుల రాజు, కుంట ఉపేందర్, ఆశాలు పాల్గొన్నారు. కాగా జిల్లా కేంద్రంలో ఆశల జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కమిటీ కన్వీనర్‌గా పి.రమాదేవి, కో కన్వీనర్‌గా ఎం.రమణ, సభ్యులుగా పుష్ప, సుజాత, నమ్మి, జ్యోతి, స్వరూప, స్వాతి, చంద్రకళ, లలిత ఎన్నికయ్యారు.

ఉద్యోగాల కల్పనలో ప్రభుత్వం విఫలం



మహబూబాబాద్ అర్బన్: స్వరాష్ట్రం ఏర్పాడితే ఉపాధి అవకాశాలు, ప్రభుత్వ ఉద్యోగాలు లభిస్తాయని ఆశపడిన విద్యార్థులు, నిరుద్యోగులు కేసీఆర్ పాలనలో బలైపోతున్నారని బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జాటోతు హుస్సేన్ నాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని శనివారం ఎర్రబొడు కాలనీ, ఇందిర కాలనీల్లో పల్లెపల్లెకు బీజేపీ ఇంటింటికి హుస్సేన్ నాయక్ ప్రజా ఆశీర్వాద యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా హుస్సేన్ నాయక్ మాట్లాడుతూ మద్యం టెండర్లకు నోటిఫికేషన్ జారీ చేయడంలో ఉన్న శ్రద్ధ నిరుద్యోగులకు ఉద్యోగ పరీక్షలను నిర్వహించడంలో లేదన్నారు. మానుకోట అభివృద్ధి చెందాలంటే కేవలం భారతీయ జనతా పార్టీతోనే సాధ్యమని ప్రజలు విశ్వాసంతో ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్యామ్‌సుందర్ శర్మ, సిద్దార్థరెడ్డి, నవీన్ నాయుడు, పద్మ, సందీప్, సంపత్, రాంబాబు నాయక్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కేజీకేఎస్ వార్షికోత్సవాన్ని విజయవంతం చేయాలి



నెహ్రూసెంటర్: కల్లుగీత కార్మిక సంఘం (కేజీకేఎస్) 66వ వార్షికోత్సవాలను విజయవంతం చేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల వెంకటరమణ పిలుపునిచ్చారు. సంఘ సమావేశం జిల్లా కేంద్రంలోని జగన్నాథం భవన్‌లో యమగాని వెంకన్న అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ కల్లుగీత కార్మికుల సమస్యల పరిష్కారానికి ఏళ్ల నుంచి పోరాటాలు నిర్వహిస్తున్నామన్నారు. వార్షికోత్సవాలను విజయవంతం చేసేలా గ్రామాల్లో జెండాను ఆవిష్కరణ చేయాలన్నారు. జిల్లా కేంద్రంలో ఈనెల 31వ తేదీన నిర్వహించే కల్లుగీత కార్మిక సంఘం వార్షికోత్సవ సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా సహాయ కార్యదర్శులు మోడెం వెంకటేశ్వర్లు, శీలం సత్యనారాయణ, డోనికని రామన్న, మొగుళ్ళ యాకన్న, జిల్లా ఉపాధ్యక్షుడు అన్నపురం రవి, గుడే వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

మానుకోట ఆర్టీసీ డిపోకు అవార్డులు

నెహ్రూసెంటర్: రాఖీ, శ్రావణమాస స్పెషల్ చాలెంజ్ అవార్డుల్లో భాగంగా మహబూబాబాద్ ఆర్టీసీ డిపోకు మొదటి స్థానం లభించిందని డిపో మేనేజర్ ఎం.శివప్రసాద్ తెలిపారు. హైదరాబాద్‌లోని ఆర్టీసీ కళాభవన్‌లో జరిగిన కార్యక్రమంలో టీఎస్ ఆర్టీసీ ఎండీ సజ్జనార్ చేతుల మీదుగా గత డిపో మేనేజర్ ఎం.విజయ్ అవార్డుతో పాటు నగదు పురస్కారాన్ని శనివారం అందుకున్నారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ ఎం.శివప్రసాద్ మాట్లాడుతూ ప్రయాణికులకు ఉత్తమ సేవలు అందించడంతో పాటు పరిశుభ్రత విభాగంలో రెండో స్థానంలో అవార్డు సాధించిందన్నారు. రాష్ట్రంలోనే అత్యధిక డిజిల్ ఆదాలో మొదటి స్థానం సాధించి డ్రైవర్ సాయన్న ప్రశంసాపత్రం, నగదు బహుమతి అందున్నారన్నారు. రానున్న రోజుల్లో డిపో అభివృద్ధికి మరింత కృషి చేయాలని డీఎం సూచించారు.

సర్వే భయం



- తుది దశకు చేరిన కాంగ్రెస్ అభ్యర్థుల ఎంపిక
- చివరి నిర్ణయం కోసం ర్యాపిడ్ సర్వే
- జిల్లా వ్యాప్తంగా పలువురి అభిప్రాయాల సేకరణ
- సర్వేలో ఏముందో, టికెట్ ఎవరికి వస్తుందోనని ఉత్కంఠ

సాక్షి, మహబూబాబాద్: ప్రతీసారి మాదిరిగానే మానుకోట జిల్లాలోని అసెంబ్లీ స్థానాలకు కాంగ్రెస్ అభ్యర్థుల ఖరారు జాప్యం జరుగుతుంది. ఇప్పటి వరకు నిర్వహించిన సర్వేలే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా 30 నియోజకవర్గాల్లో ర్యాపిడ్ సర్వే నిర్వహించి టికెట్ ఖరారు చేస్తున్నారు. ఇందులో జిల్లాలోని రెండు నియోజకవర్గాలు ఉండటంతో.. టికెట్ నాదే అని కొందరు.. మాకే టికెట్ వస్తుందని మరికొందరు వాదించడంతో అసలు ఎవరికి టికెట్ వస్తుందోనని కార్యకర్తల్లో ఉత్కంఠ రేపుతుంది. కాంగ్రెస్ అభ్యర్థులు ఎవరు అనేది వారి పార్టీలోనే కాకుండా ఇటు బీఆర్‌ఎస్, బీజేపీ పార్టీలో కూడా చర్చగా మారడం గమనార్హం.

ర్యాపిడ్ సర్వే రహస్యం ఏంటో..

కాంగ్రెస్ పార్టీలో ఇటీవలి కాలంలో చోటు చేసుకున్న పరిణామాల నేపథ్యంలో టికెట్ల కేటాయింపు గెలుపు గుర్రాలకే ఇవ్వాలనే నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. ప్రధానంగా ఏఐసీసీ నుంచి టీపీసీసీ వరకు నాయకులు ఇదే మాట చెప్పినట్లు ఆ పార్టీ పెద్దలు చెబుతున్నారు. ఇందులో భాగంగా మానుకోట జిల్లాలోని మహబూబాబాద్ నియోజకవర్గం నుంచి పోటీ పడుతున్న కేంద్ర మాజీ మంత్రి బలరాం నాయక్, మహబూబాబాద్ మున్సిపాలిటీ మాజీ చైర్మన్ భర్త మురళీ నాయక్, ఎల్‌హెచ్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఎస్టీ విభాగం జాతీయ నాయకుడు బెల్లయ్య నాయక్, అదేవిధంగా డోర్నకల్ నియోజకవర్గం నుంచి డాక్టర్ రాంచంద్రు నాయక్, నెహ్రూ నాయక్‌లో ఎవరికి ప్రజాబలం ఉందనే విషయంపై హైదరాబాద్ నుంచి వచ్చిన టీమ్ సర్వే నిర్వహించారు. అదేవిధంగా రెండో దఫా మళ్లీ సర్వే నిర్వహించిన సందర్భంలో మహబూబాద్‌లో నూనావత్ రాధా, డోర్నకల్ నియోకవర్గంలో భూపాల్ నాయక్‌ల పేర్లు చేర్చి సర్వే చేశారు. అయితే మొదటి సర్వే, రెండో సర్వేల నివేదికలు అందచేశారు. సెలక్షన్ కమిటీలోని కొందరు రాష్ట్ర వ్యాప్తంగా 30 నియోజకవర్గాల్లో ర్యాపిడ్ సర్వే నిర్వహించాలని ఆదేశించారు. అందులో జిల్లాలోని మహబూబాబాద్, డోర్నకల్ నియోజకవర్గాలు ఉండటంతో.. ఈ రెండు నియోజకవర్గాల్లో కూడా ర్యాపిడ్ సర్వే నిర్వహించారు. నివేదికను ఏఐసీసీ స్థాయిలోని టికెట్ సెలక్షన్ కమిటీకి అందచేశారు.

ఎవరి ధీమా వారిది..

ఇటీవల నిర్వహించిన ర్యాపిడ్ సర్వే తనకే అనుకూలంగా వచ్చిందంటే.. తనకే అనుకూలంగా ఉందనే విషయాన్ని నాయకుల చెప్పుకుంటూ టికెట్‌పై ధీమా వ్యక్తం చేస్తున్నారు. 'ప్రజలను నమ్ముకున్నం సర్వేల సందర్భంగా ప్రజలు ఇచ్చిన నివేదికనే మాకు రక్షణ' అని కొందరు అంటున్నా.. ప్రజల అభిప్రాయాలతోపాటు.. తమ సంబంధాలు కూడా తమకు టికెట్ వచ్చేందుకు దోహద పడుతాయని అంటున్నారు. అయితే అసలు సర్వే ఎవరికి అనుకూలం.. ఎవరికి ప్రతికూలం అనేది మాత్రం ఏఐసీసీ ఏర్పాటు చేసిన కమిటీ వద్ద ఉంది.

ఇతర పార్టీల్లో చర్చ..

జిల్లాలోని మహబూబాబాద్, డోర్నకల్‌తోపాటు పాలకుర్తి, ఇల్లెందు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఎవరు అనేది సొంత పార్టీల కన్నా..ఇతర పార్టీల నాయకుల్లోనే ఎక్కువ చర్చ జరుగుతుంది. మానుకోటలో బలరాం నాయక్ వస్తే ఎలా.. మురళీ నాయక్‌కు వస్తే ఎలా.. ఎవరికి టికెట్ వస్తే మహబూబాబాద్ మున్సిపాలిటీ ఓటర్లు చీలుతాయి. రూరల్ ఓటర్లు ఎలా స్పందిస్తారో అని అధికార బీఆర్‌ఎస్, బీజేపీ పార్టీల నాయకులు లెక్కలు వేసుకుంటున్నారు. అలాగే డోర్నకల్‌లో రాంచంద్రునాయక్, నెహ్రూ నాయక్, భూపాల్ నాయక్, పాలకుర్తిలో తిరుపతి రెడ్డి, ఝాన్సీ రెడ్డిల్లో ఎవరికి టికెట్ వస్తుంది.. ఎవరు ఎక్కువ డబ్బులు ఖర్చు చేస్తారు. కేడర్ ఎవరి వెంట ఉన్నారు. టికెట్ రాక పోతే ఇండిపెండెంట్‌గా పోటీలో ఉంటారా.. లేదా బీజేపీ నుంచి పోటీలో దిగుతారా అనేది కీలకంగా మారనుంది. అయితే పలు మండలాలు, గిరిజన తండాల్లో పార్టీలకు కాకుండా అభ్యర్థులను బట్టి ఓటు బ్యాంకు ఉండే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు. ఈ పరిస్థితిలో కొందరికి టికెట్ వస్తే తమ గెలుపు నల్లేరుపై నడకే అని మరికొందరికి టికెట్ వస్తే మాత్రం శ్రమించాల్సి ఉంటుందని సాక్ష్యాత్తు బీఆర్‌ఎస్ నాయకులే చెప్పడం గమనార్హం.

మెనూ ప్రకారం అల్పాహారం అందించాలి



మరిపెడ: అల్పాహారాన్ని పరిశీలిస్తున్న డేవిడ్



కేసముద్రం: తాళ్లపూసపల్లిలో అల్పాహారం తింటున్న డీఈఓ రామారావు

మరిపెడ: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అల్పాహారం పథకం విద్యార్థులకు మెనూ ప్రకారం అందించాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ డేవిడ్ అన్నారు. మరిపెడలోని జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న అల్పాహారం పథకాన్ని మున్సిపల్ కమిషనర్ రాజుతో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్వాహకులు మెనూ ప్రకారం అల్పాహారం అందించాలని, లేదంటే చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మున్సిపల్ కమిషనర్ పర్యవేక్షణలో ఈ పథకం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇతర అధికారులు కూడా నిత్యం తనిఖీలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ రాజు, తహసీల్దార్ సైదులు తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూసపల్లిలో డీఈఓ రామారావు

కేసముద్రం: తాళ్లపూసపల్లి జెడ్పీహైస్కూల్‌ను శనివారం డీఈఓ రామారావు, డీఆర్‌డీఏ సన్యాసయ్య, జెడ్పీసీఈఓ రమాదేవి ఆకస్మికంగా సందర్శించారు. ఈ మేరకు పాఠశాలలో ప్రారంభమైన అల్పాహారం పథకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ పిల్లలకు నాణ్యమైన అల్పాహారం, భోజనం అందేవిధంగా చూడాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. అనంతరం పాఠశాలలో రికార్డులను, పరిసరాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి అల్పాహారం తిన్నారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ డెబోరా, ఎంపీడీఓ రవీంద్రరావు, నోడల్ ఆఫీసర్ కొత్త జగన్మోహన్‌రెడ్డి, హెచ్‌ఎం కనకయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'మా కుటుంబానికి న్యాయం చేయండి'



నిరసన తెలుపుతున్న ఉమామాధవి కుటుంబ సభ్యులు

నెహ్రూసెంటర్: భూ తగాదా విషయంలో తమకు న్యాయం చేయాలని మండలంలోని వీఎస్ లక్ష్మిపురం గ్రామానికి చెందిన బొర్రాజు ఉమామాధవి లింగన్న కోరారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో శనివారం కుటుంబ సభ్యులతో కలిసి ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 3/ఏ/1/4/1లో 35 గుంటల భూమి ఉందని, గ్రామానికి చెందిన కొంత మందితో భూ తగాదా ఉండగా ఆ విషయమై కోర్టు నుంచి ఇంజక్షన్ ఆర్డర్ తీసుకువచ్చామన్నారు. అయితే ఈ భూ తగాదా విషయంలో మహబూబాబాద్ రూరల్ ఎస్సై పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి తిట్టడంతో పాటు కొట్టారని, నా మాట వినకపోతే రౌడీషీట్ ఓపెన్ చేస్తానని బెదిరింపులకు పాల్పడుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధం లేని విషయంలో రూరల్ ఎస్సై కలుగజేసుకుని డబ్బులు ఇస్తేనే సమస్య పరిష్కరిస్తానని వేధింపులకు పాల్పడుతున్నాని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయమై రూరల్ ఎస్సైని వివరణ కోరగా లింగన్నకు సంబంధించిన భూ తగాదా విషయంలో గతంలోనే కేసులు అయ్యాయని, ఈ విషయంలో వారిని ఎలాంటి ఇబ్బందులకు గురి చేయలేదని, డబ్బులు అడిగామనే విషయంలో వాస్తవం లేదన్నారు.

న్యాయసేవలపై విస్తృత ప్రచారం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి చంద్రశేఖరప్రసాద్



మాట్లాడుతున్న చంద్రశేఖరప్రసాద్

మహబూబాబాద్ రూరల్: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలు, విద్యార్థులకు న్యాయ సేవలపై అవగాహన కల్పిస్తూ విస్తృత ప్రచారం చేపట్టాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పసుపులేటి చంద్రశేఖరప్రసాద్ అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్న న్యాయ విజ్ఞాన సదస్సుల ప్రచార వాహనాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి చంద్రశేఖరప్రసాద్ శనివారం జిల్లా కోర్టు ఆవరణలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయ సేవలపై ప్రజలకు తెలియజేయటం ద్వారా వారికి న్యాయ వ్యవస్థపై మరింత నమ్మకం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి సురేష్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి తిరుపతి, జిల్లా కోర్టు పీపీ చిలుకమారి వెంకటేశ్వర్లు, పోక్సో కోర్టు పీపీ కీసర పద్మాకర్ రెడ్డి, జిల్లా లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ దాసరి నాగేశ్వర్ రావు, డిప్యూటీ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ వల్లపు యాదగిరి, ప్రభుత్వ ప్లీడర్ కొంపెల్లి వెంకటయ్య పాల్గొన్నారు.

రూ.400 కోట్లతో రోడ్ల అభివృద్ధి

- మంత్రి సత్యవతిరాథోడ్
- తల్లిదండ్రులను గుర్తు చేసుకొని భావోద్వేగానికి గురైన మంత్రి



కురవి: పెద్దతండాలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి సత్యవతిరాథోడ్

కురవి: సీఎం కేసీఆర్ ఆశీర్వాదంతో జిల్లాలో రూ.400 కోట్లతో రోడ్ల అభివృద్ధి చేస్తున్నట్లు మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. శనివారం మండలంలోని గుండ్రాతిమడుగు (విలేజి) శివారు పెద్దతండా జీపీలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. యువకులకు క్రికెట్ కిట్లు, మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. గిరిజన శాఖ నుంచి రూ.6 వేల కోట్లను ఖర్చు చేస్తే అందులో జిల్లాకు రూ.450 కోట్లు, తన ప్రాంతానికి రూ.150 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. డోర్నకల్ నియోజకవర్గంలో 108 రహదారులకు రూ.155.39 కోట్లు కేటాయించడం జరిగిందన్నారు. గత పాలకులు అంగన్‌వాడీలను పట్టించుకోలేదని, పౌష్టికాహారాన్ని భర్తీ చేసేందుకు పిండి ఇచ్చే వారని, దాన్ని తినలేక కుడితిలో పడేశారని గుర్తు చేశారు. ప్రస్తుతం కేసీఆర్ పౌష్టికాహారం ఇస్తున్నారన్నారు. కాగా సభలో తల్లిదండ్రులను గుర్తు చేసుకుని మంత్రి సత్యవతిరాథోడ్ భావోద్వేగానికి గురయ్యారు. వేదికపై కన్నీళ్లు పెట్టుకుని అందరిని కంటతడిపెట్టించారు. కార్యక్రమంలో కలెక్టర్ శశాంక, జెడ్పీచైర్‌పర్సన్ ఆంగోత్‌బిందు, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, ఎంపీ మాలోత్ కవిత, జెడ్పీటీసీ బండి వెంకటరెడ్డి, సర్పంచ్‌లు గుగులోత్ వనజా శ్రీరాం, జీవన్, బోడ శ్రీను, జంగిలి హరిప్రసాద్, ఆర్‌అండ్‌బీ సీఈ మోహన్‌నాయక్, బీఆర్‌ఎస్ నాయకులు గుగులోత్‌కిషన్‌నాయక్, కొంపెల్లి శ్రీధర్‌రెడ్డి, నూకల శ్రీరంగారెడ్డి, కొమ్మినేని రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

బయ్యారం అభివృద్ధి మా బాధ్యత

బయ్యారం/గార్ల: వెనుకబడిన బయ్యారం ప్రాంత అభివృద్ధిని మా బాధ్యతగా తీసుకుంటామని మంత్రి సత్యవతిరాథోడ్ అన్నారు. మండలంలోని పలు గ్రామాలకు నూతనంగా నిర్మించనున్న రహదారులు, బ్రిడ్జిల పనులకు మంత్రి శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి మంత్రి మాట్లాడారు. పేదప్రజల కష్టాలు తెలిసి అండగా నిలుస్తున్న సీఎం కేసీఆర్‌ను మరోసారి ఆశీర్వదించాలన్నారు. అలాగే గార్ల మండలంలోని పలు గ్రామాల్లో రూ.18 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

- అదనపు జూనియర్ సివిల్ జడ్జి తిరుపతి



సదస్సులో మాట్లాడుతున్న తిరుపతి

మహబూబాబాద్ అర్బన్: విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించడానికి న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహిస్తున్నామని మానుకోట అదనపు జూనియర్ సివిల్ జడ్జి యూ.తిరుపతి అన్నారు. మానుకోట మున్సిపల్ పరిధిలోని ముత్యాలమ్మ గూడెం గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో శనివారం న్యాయ చైతన్య రథం, సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు జూనియర్ సివిల్ జడ్జి తిరుపతి మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి ఉన్నత చదువులు చదవాలని, ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సివిల్ కేసులు వాయిదాలతో నిమిత్తం లేకుండా ఇరువర్గాల వారు రాజీకి ముందుకు వస్తే వాటిపై తుది తీర్పుతో న్యాయ చేస్తామన్నారు. చిన్న వయస్సులోనే చట్టాల గురించి తెలుసుకోవాలని, ఆడపిల్లలకు 18 సంవత్సరాలు దాటిన తర్వాతనే వివాహం జరిపించాలన్నారు. ఉన్నత చదువులతోనే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు కొంపల్లి వెంకటయ్య, దాసరి నాగేశ్వర్‌రావు, యాదగిరి, మౌనిక, ఎస్సై రాంచరణ్, హెచ్‌ఎం భాగ్యమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరంలో సాంస్కృతిక కార్యక్రమాలు



సమావేశంలో పాల్గొన్న చైర్మన్ తదితరులు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వరముక్తీశ్వరస్వామి ఆలయం పాలక మండలి సర్వసభ్య సమావేశాన్ని చైర్మన్ లింగంపల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన ఈఓ మహేష్‌తో కలిసి శనివారం నిర్వహించారు. ఈనెల 15 నుంచి 23 వరకు నిర్వహించనున్న దేవీశరన్నవరాత్రి ఉత్సవాల ఏర్పాట్లపై చర్చించి పలు తీర్మానాలు చేశారు. ఉత్సవాల తొమ్మిది రోజుల్లో ఐదు రోజులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 17న సామూహిక నవగ్రహ నక్షత్ర శాంతి, దుర్గా హోమం నిర్వహించేందుకు నిర్ణయించారు. దేవస్థానంలోని సింగరేణి వసతి గృహం కలరింగ్, ఇతర అభివృద్ధి పనులు చేసి భక్తులకు వసతి సౌకర్యాలు కల్పించనున్నారు. దేవస్థానంలో ప్రస్తుతం నూనె, నెయ్యితో ప్రసాదాలు తయారు చేస్తుండగా, లడ్డు ప్రసాదం నవంబర్ 1 నుంచి పూర్తిగా నెయ్యితో తయారు చేసి భక్తులకు విక్రయించడానికి నిర్ణయించారు. సద్దుల బతుకమ్మ రోజు దేవస్థానం ఆవరణలో బతుకమ్మలు ఆడేందుకు ఏర్పాట్లు చేయనున్నారు. సంప్రదాయ పద్ధతిలో బతుకమ్మను అలంకరించిన ఇద్దరికి బహుమతులు ఇచ్చేందుకు తీర్మానించారు. కార్యక్రమంలో ధర్మకర్తలు సమ్మయ్య, రాంరెడ్డి, దేవేందర్, పద్మ, కృష్ణమూర్తిశర్మ, అర్చకుడు ఫణీంద్రశర్మ, సూపరింటెండెంట్ శ్రీనివాస్ ఉన్నారు.

మహిళలకు అండగా షీ టీమ్



మాట్లాడుతున్న షీ టీమ్ ఎస్సై సునంద

మహబూబాబాద్ అర్బన్: బాలికలు, విద్యార్థినులు, మహిళలకు అండగా షీ టీమ్ ఉంటుందని షీ టీమ్ ఎస్సై సునంద అన్నారు. ఎస్పీ చంద్రమోహన్ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలోని గీతాంజలి హైస్కూల్‌లో షీ టీమ్ భరోసా అవగాహన సదస్సు శనివారం నిర్వహించగా షీ టీమ్ ఎస్సై సునంద హాజరై మాట్లాడారు. విద్యార్థినులను, మహిళలను ఎవరైన గుర్తు తెలియని వ్యక్తులు ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్ సైబర్ క్రైమ్‌లకు పాల్పడినట్లయితే వెంటనే 100, జిల్లా షీ టీమ్ 8712656935 నంబర్‌కు ఫోన్ చేయవచ్చన్నారు. సమాజంలో జరుగుతున్న అఘాయిత్యాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై ఆనందం, ఉమెన్ పీసీ పార్వతి, ఊర్మిళ, రమేష్, మౌనిక, గీతాంజలి హైస్కూల్ డైరెక్టర్, కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ రామకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ మంజుల తదితరులు పాల్గొన్నారు.

పీవైఎల్ మహాసభలను జయప్రదం చేయాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నర్సయ్య, తదితరులు

నెహ్రూసెంటర్: ఈ నెల 12, 13 తేదీల్లో జిల్లా కేంద్రంలో జరుగనున్న ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) 8వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో మహాసభల పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య మాట్లాడుతూ రాష్ట్రం, దేశంలో నిరుద్యోగం పెరిగిపోతుందని, సుమారు 25 కోట్ల చదువుకున్న నిరుద్యోగులు ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారన్నారు. టీచర్ పోస్టుల భర్తీకి మెగా డీఎస్సీ వేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి ఎం.అన్వేష్, ఆహ్వాన సంఘం నాయకులు జగ్గన్న, ముంజంపల్లి వీరన్న, కొయ్యల శ్రీనివాస్, మదన సత్యం, పీవైఎల్ రాష్ట్ర నాయకులు పైండ్ల యాకయ్య, కె. రవికుమార్, కృష్ణ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంగయ్య, అనిల్, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు రామకృష్ణ, జిల్లా కార్యదర్శి సంతోష్, కె.భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

మిర్చికి గుబ్బరోగం.. దున్నేసిన రైతు

- రూ.2లక్షలకు పైగా నష్టం వాటిల్లిందని ఆవేదన



మిర్చిపంటను ట్రాక్టర్‌తో దున్నుతున్న రైతు శంకర్

కేసముద్రం: మిర్చి పంటకు గుబ్బరోగం సోకడంతో రైతు చేను మొత్తాన్ని శనివారం ట్రాక్టర్‌తో దున్నేశాడు. కేసముద్రం మండలం పీక్లాతండాజీపీ శివారు లోక్యాతండాకు చెందిన ఉపసర్పంచ్ గుగులోతు శంకర్ తనకున్న 3 ఎకరాల్లో మిర్చి సాగుచేశాడు. 3 నెలల అనంతరం చేనుకు గుబ్బతెగులు సోకింది. పలురకాల మందులను కొట్టినప్పటికీ ఫలితం లేకపోవడంతో పంట చేతికి రాదని గ్రహించిన శంకర్.. శనివారం ట్రాక్టర్ సాయంతో మొత్తం చేనును దున్నేశాడు. 40 మిర్చి విత్తన ప్యాకెట్‌లు, నారుకు రూ.70వేలు, ఎరువుల మందులకు రూ.25వేలు, దున్నుడు కూళ్లకు, కూలీలకు కలిపి రూ.40వేలు, తెగుళ్ల నివారణకుగాను కొట్టిన మందులకు రూ.80వేల ఖర్చు వచ్చినట్లు బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. ఒక పక్క రెక్కల కష్టం, మరో పక్క రూ.2లక్షలకుపైగా నష్టం వాటిల్లిందని ఆ రైతు కుటుంబం కన్నీళ్లు పెట్టుకుంది. ఇదే 3 ఎకరాల్లో మొక్కజొన్న పంటను సాగు చేస్తానని ఆ రైతు చెప్పుకొచ్చాడు.

23న విజయదశమి వేడుకలు జరుపుకోవాలి



మాట్లాడుతున్న అనంతమల్లయ్య శర్మ

కాజీపేట: విజయ దశమి పండుగను ఈనెల 23న జరుపుకోవాలని భద్రకాళి దేవస్థాన ఆస్థాన పండితులు అయినవోలు అనంత మల్లయ్య శర్మ సిద్ధాంతి పిలుపునిచ్చారు. కాజీపేట స్వయంభు శ్రీశ్వేతార్క మూలగణపతి దివ్య క్షేత్రం సమావేశ మందిరంలో శనివారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ.. 23, 24వ తేదీల్లో పండుగను ఎప్పుడు జరుపుకోవాలనే సందిగ్ధత నెలకొందని, 23న పండుగ చేసుకోవాలని నిర్ణయించినట్లు తెలిపారు.

ఇనుగుర్తి బీట్ ఆఫీసర్ సస్పెన్షన్

కేసముద్రం: ఇనుగుర్తి బీట్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న శ్రీధర్‌ను సస్పెండ్ చేస్తూ డీఎఫ్ఓ రవికిరణ్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. తొర్రూర్ రేంజ్ పరిధిలోని ఇనుగుర్తి(సౌత్) బీట్‌లోని కంపార్ట్‌మెంట్ నంబర్ 1148లో అక్రమంగా ఫారెస్టు భూమిని దున్నిన వాస్తవాన్ని, ఉన్నతాధికారులకు తెలపకుండా నిర్లక్ష్యం చేసినందుకు బీట్ ఆఫీసర్ శ్రీధర్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు పేర్కొన్నారు.

పరీక్షల ఫీజు చెల్లించాలి

విద్యారణ్యపురి: రెగ్యులర్, ఫెయిల్ అయిన ఛాత్రోపాధ్యాయులు పరీక్షల ఫీజును ఈనెల 27 వరకు చెల్లించాలని హనుమకొండ ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ కె.నారాయణరెడ్డి శనివారం ఒక ప్రకటనలో కోరారు. డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఈఐఈడీ), డిప్లొమా ఇన్ ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్ (డీపీఎస్‌ఈ) ప్రథమ సంవత్సరం, 2022–24 రెగ్యులర్ బ్యాచ్ ఛాత్రోపాధ్యాయులు, ఫెయిల్ అయిన 2019–21 బ్యాచ్ ఛాత్రోపాధ్యాయులు తమ వార్షిక పరీక్ష ఫీజు ఈనెల 27 వరకు చెల్లించవచ్చని ఆయన పేర్కొన్నారు. రూ.50 అపరాధ రుసుముతో నవంబర్ 11 వరకు చెల్లించవచ్చన్నారు.

మణుగూరు-బెల్గాం ఎక్స్‌ప్రెస్‌..



● కాజీపేట-మణుగూరు మధ్య రద్దు

కాజీపేట రూరల్‌: కాజీపేట సబ్‌ డివిజన్‌ పరిధిలో జరుగుతున్న ఇంజనీరింగ్‌ వర్క్స్‌, మూడో రైల్వే లైన్‌ మార్గం కారణంగా కాజీపేట జంక్షన్‌ మీదుగా ప్రయాణించే మణుగూరు–బెల్గాం ఎక్స్‌ప్రెస్‌ను దూరం తగ్గించి నడిపిస్తున్నట్లు రైల్వే అధికారులు శనివారం తెలిపారు. సెప్టెంబర్‌ 30 నుంచి నవంబర్‌ 30వ తేదీ వరకు బెల్గాం–మణుగూరు (07335) ఎక్స్‌ప్రెస్‌ను కాజీపేట వరకు నడిపిస్తూ కాజీపేట–మణుగూర్‌ మధ్య రద్దు చేసినట్లు తెలిపారు. అదే విధంగా మణుగూరు–బెల్గా (07336) ఎక్స్‌ప్రెస్‌ అక్టోబర్‌ 1 నుంచి డిసెంబర్‌ 1వ తేదీ వరకు కాజీపేట వరకు నడిపిస్తూ మణుగూరు–కాజీపేట మధ్య రద్దు చేసినట్లు రెల్వే అధికారులు తెలిపారు.

ప్రమాదమా..హత్యా ?

● బైక్‌తో నీటిగుంతలో పడిన కుటుంబం
● భార్య, కుమారుడి మృతి.. భర్త క్షేమం
● పరకాల మండలం వెల్లంపల్లి శివారులో ఘటన
● అల్లుడిపై మృతురాలి కుటుంబీకుల అనుమానం



భార్య, కొడుకుతో రమేష్‌ (ఫైల్‌)

పరకాల : ఓ వ్యక్తి తన భార్యను ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్య పరీక్షలు చేయించాడు. అనంతరం ద్విచక్ర వాహనంపై రాత్రి ఇంటికి ప్రయాణమయ్యాడు. ఈ క్రమంలో బయలుదేరిన గంటలోనే ద్విచక్ర వాహనం నీటి గుంతలో పడింది. ఈ ప్రమాదంలో భార్య, కుమారుడు మృతి చెందగా భర్త క్షేమంగా బయటపడ్డారు. కాగా, ఈ ఘటనలో అల్లుడికి (మృతురాలి భర్త) ఎలాంటి గాయాలు కాకపోవడంతో పాటు రాత్రి సమయంలో ఆస్పత్రి నుంచి ఇంటికి తీసుకు రావడంపై మృతురాలి కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం వరంగల్‌ శంభునిపేటకు చెందిన పస్తరి సమ్మక్క, రాజేందర్‌ దంపతుల పెద్ద కూతురు రాజేశ్వరి(21)ని మూడున్నర సంవత్సరాల క్రితం నడికూడ మండలం నర్సక్కపల్లికి చెందిన తూర్పాటి రమేష్‌కు ఇచ్చి వివాహం చేశారు. దంపతులు ఆరు నెలల వరకు అన్యోన్యంగా ఉన్నారు. అనంతరం మనస్పర్థలు ప్రారంభమయ్యాయి. రమేష్‌కు మరో యువతితో పరిచయం కావడంతో ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. ఈ దంపతులకు మూడేళ్ల కుమారుడు సాయి ఇషాన్‌ ఉన్నాడు. ఈ క్రమంలో రాజేశ్వరి మళ్లీ గర్భం దాల్చడంతో శుక్రవారం వరంగల్‌లోని సీకేఎం ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్య పరీక్షలు చేయించాడు. అనంతరం రాత్రి వేళలో ఇంటికి బయలుదేరుతుండగా వద్దని మృతురాలి అక్కాచెల్లెలు ఎంత వారించినా పట్టించుకోలేదు. ద్విచ్రవాహనంపై భార్య, కుమారుడిని తీసుకుని బయలుదేరాడు. ఈ క్రమంలో రాత్రి 9 గంటలకు ద్విచక్రవాహనం పరకాల మండలం వెల్లంపల్లి క్రాస్‌ సమీపంలోని నేతాని కుంటలో పడింది. ఈ ఘటనలో భార్య రాజేశ్వరి, కుమారుడు ఇషాన్‌ మృతి చెందగా రమేష్‌ క్షేమంగా బయటపడ్డాడు.



పోలీసు స్టేషన్‌ వద్ద మృతురాలి కుటుంబ సభ్యులు

రాత్రి కుమారుడు, ఉదయం తల్లి మృతదేహాలు లభ్యం

నీటి గుంతలో పడగానే రమేష్‌ ఫోన్‌ చేసి ఇరు కుటుంబాలకు సమాచారం అందించాడు. వారు హుటాహుటినా ఘటనా స్థలికి చేరుకుగానే రాజేశ్వరి దొరకడం లేదని.. సాయిఇషాన్‌ మృతదేహంతో విలపిస్తూ కనిపించాడు. సమాచారం అందుకున్న పరకాల పోలీసులు రాత్రి నుంచి అగ్నిమాపక సిబ్బంది సాయంతో గాలింపు చేపట్టగా శనివారం ఉదయం 10 గంటలకు రాజేశ్వరి మృతదేహం లభ్యమైంది. ఇద్దరి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పరకాలకు తరలించారు. కాగా, తన కుమార్తె, మనువడి మృతికి అల్లుడే కారణమంటూ మృతురాలి తల్లి సమ్మక్క పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

పోలీసుస్టేషన్‌ వద్ద ఉద్రిక్తత..

ద్విచక్రవాహనం నీటి గుంతలో పడి తల్లి, కుమారుడు మృతి చెందాడని తెలుసుకున్న రాజేశ్వరి బంధువులు ఆమె భర్తపై అనుమానం వ్యక్తం చేస్తూ పెద్ద సంఖ్యలో పరకాల పోలీసుస్టేషన్‌ వద్దకు చేరుకున్నారు. అతడిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు.

పోలీసుస్టేషన్‌లో రమేష్‌ ఆత్మహత్యాయత్నం

ఘటనపై మృతురాలి బంధువులు అనుమానం వ్యక్తం చేయడంతో పోలీసులు రమేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. దీంతో తనపై అనవసరపు నిందలు వేస్తున్నారంటూ పోలీసు స్టేషన్‌లోనే రమేష్‌ బ్లేడ్‌తో కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు.

వరకట్న వేధింపులతో వివాహిత ఆత్మహత్య

తరిగొప్పుల : వరకట్న వేధింపులు తాళలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని పోతారంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై దూదిమెట్ల రమేష్‌, గ్రామస్తుల కథనం ప్రకారం.. బచ్చన్నపేటకు చెందిన కర్రె అంజయ్య కుమార్తె నిఖిత (22)ను 22 నెలల క్రితం పోతారం గ్రామానికి చెందిన పాకాల నరేష్‌కు ఇచ్చి వివాహం జరిపించారు. సజావుగా సాగుతున్న కాపురంలో నాలుగు నెలల తర్వాత భర్త నరేష్‌, అత్త నర్సవ్వలు అదనపు కట్నం తేవాలని నిఖితను నిత్యం వేధించేవారు. ఈ విషయమై పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ నిర్వహించగా బచ్చన్నపేటలోని ఓ ప్లాటును నిఖిత పేరున రిజిస్ట్రేషన్‌ చేయించారు. అయినా భర్త, అత్త ప్రవర్తనలో మార్పు రాలేదు. కాగా శుక్రవారం ఉదయం నిఖితను తన భర్త, అత్త కొట్టి ఇష్టం వచ్చినట్లు తిట్టడంతో మనస్తాపంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన వారు చికిత్స నిమిత్తం వరంగల్‌ ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందింది. ఎస్సై ఘటనా స్థలం వద్దకు వెళ్లి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

భర్త వేధింపులు.. ఖిలాషాపూర్‌లో భార్య..



రజిత (ఫైల్‌)

రఘునాథపల్లి: భర్త వేధింపులు తాళలేక భార్య ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన మండలంలోని ఖిలాషాపూర్‌లో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం హనుమకొండ జిల్లా వేలేర్‌ మండలం కమ్మరిపేట గ్రామానికి చెందిన అల్లిబిల్లి రజిత (33)ను 14 సంవత్సరాల క్రితం మండలంలోని ఖిలాషాపూర్‌కు చెందిన రవీందర్‌కు ఇచ్చి వివాహం చేశారు. అయితే సంతానం కావడం లేదని కొంతకాలంగా భర్త వేధిస్తున్నాడు. దీంతో రజిత పలుమార్లు ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గ్రామ పెద్దలు చెప్పినా భర్త వేధింపులు ఆగడం లేదు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం మద్యం సేవించి సంతానం కలుగడం లేదంటూ దూషించాడు. దీంతో మనస్తాపానికి గురైన రజిత శుక్రవారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహ్యతకు యత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు తలుపులు విరగ్గొట్టి రజితను ఉరినుంచి విడదీశారు. అప్పటికే అపస్మారక స్థితికి చేరుకోగా ఓ వాహనంలో ఆస్పత్రికి తీసుకెళ్లే క్రమంలో మృతి చెందింది. ఈ ఘటనపై మృతురాలి తండ్రి చీటి రాజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రఘుపతి తెలిపారు.

దాయాదులు తిట్టారని..

● వివాహిత ఆత్మహత్యాయత్నం
● చికిత్స పొందుతూ మృతి



రమ(ఫైల్‌)


సంగెం: దాయాదులు తిట్టి అవమానపరిచారని మనోవేదనకు గురైన ఓ వివాహిత.. పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని ఆశాలపల్లిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన దండు వీరస్వామి, సమ్మయ్య, సదయ్య అన్నదమ్ములు. వీరిలో సమ్మయ్య, సదయ్యకు ఇటీవల గృహలక్ష్మి పథకంలో ఇళ్లు మంజూరయ్యాయి. ముగ్గు పోసుకుని పిల్లర్లు నిర్మిస్తున్న క్రమంలో వీరస్వామి వైపు ఉన్న హద్దును సమ్మయ్య హద్దుతో సమానంగా జరపాలని, అందరం భూమిని సమానంగా తీసుకుందామని అడగ్గా.. వీరస్వామి, అతని భార్య వసంత, సదయ్య, అతని భార్య స్వరూప ససేమిరా అన్నారు. ఈ విషయంలో సమ్మయ్య భార్య రమ(47)ను నలుగురు వీరస్వామి, వసంత, సదయ్య, స్వరూప దూషించారు. దీంతో ఈ ఘటనపై ఈ నెల 6వ తేదీన పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీ నిర్వహించారు. ఇక్కడ కూడా 'మీరు చచ్చినా హద్దులు జరపమని' సమ్మయ్య, రమ దంపతులను దూషించారు. దీంతో అవమాన భారం భరించలేక రమ శుక్రవారం సాయంత్రం పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి చేరుకుంది. గమనించిన సమ్మయ్య స్థానికుడు ప్రశాంత్‌ సాయంతో ఎంజీఎం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అదేరోజు రాత్రి మృతి చెందింది. ఈ ఘటనపై సమ్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై భరత్‌ తెలిపారు.

అంగన్‌వాడీ విద్యార్థికి తేలు కాటు

మరిపెడ రూరల్‌: మరిపెడ మండలం ఉల్లెపల్లి గ్రామానికి చెందిన అంగన్‌వాడీ–3 కేంద్రంలో విద్యార్థి కోల ధనుష్‌ శనివారం తేలుకాటుకు గురయ్యాడు. గమనించిన అంగన్‌వాడీ కేంద్ర నిర్వాహకులు వెంటనే స్థానికంగా చికిత్స చేయించారు. బాలుడి పరిస్థితి నిలకడగా ఉందని వారు పేర్కొన్నారు. కాగా, అంగన్‌వాడీ కేంద్ర నిర్వాహకుల నిర్లక్ష్యం కారణంగానే బాలుడు తేలుకాటుకు గురయ్యాడని గ్రామస్తులు ఆరోపించారు. వారి పర్యవేక్షణ లేకపోవడంతో పిల్లలు బయటకు రాగా, అందులో ఓ బాలుడు తేలుకాటుకు గురయ్యాడని మండిపడ్డారు.

రూ.51.12 కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభం

● పెంబర్తి, సూదన్‌పల్లిలో నిరసనలు
● ప్రతి ఒక్కరికీ దళితబంధు : ఎమ్మెల్యే అరూరి



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలంలోని పది గ్రామాల్లో శనివారం ఎమ్మెల్యే అరూరి రమేశ్‌ సుడిగాలి పర్యటన చేశారు. వంగపహాడ్‌, ఆయా గ్రామాల్లో సుమారు రూ.50.12 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. సూదన్‌పల్లి, గంటూరుపల్లి, జయగిరి, భైరాన్‌పల్లి, హెచ్‌సీ తండా, సిద్ధాపురం గ్రామాల్లో శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. రూ.25 కోట్లతో చేపడుతున్న నాగారం పెద్ద చెరువు అభివృద్ధి పనులు ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ దళితబంధు, గృహలక్ష్మి పథకం వర్తింపజేస్తామన్నారు. అభివృద్ధి,సంక్షేమానికి సమ ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు.

అడ్డుకునేందుకు యత్నం

పెంబర్తి ఎస్సీ కాలనీ వద్ద ఎమ్మెల్యే కాన్వాయ్‌ వెళ్తుండగా.. స్థానికులు అడ్డుకునేందుకు యత్నించారు. ఈక్రమంలో స్థానికులను పోలీసులు నెట్టి వేశారు. దళిత బంధు, డబుల్‌బెడ్రూమ్‌ ఇవ్వాలని స్థానికులు ఎమ్మెల్యే ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అదేవిధంగా సూదన్‌పల్లిలో కోతుల బెడద ఎక్కువైందని స్థానికులు ఎమ్మెల్యే ఎదుట నిరసన తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు పెద్ది తిరుపతమ్మ, బొల్లవేణి రాణి, పెసరు శ్రీనివాస్‌రెడ్డి, అరుణ్‌కుమార్‌, ధనలక్ష్మి, సాంబారెడ్డి, జోరిక పూల, ఎంపీపీ కేతపాక సునీత, జెడ్పీటీసీ సభ్యురాలు రేణుకుంట్ల సునీత, వైస్‌ ఎంపీపీ రత్నాకర్‌రెడ్డి, నాయకులు జంగా కుమార్‌, బండి రజనీకుమార్‌, మేకల భగవాన్‌రెడ్డి, మేర్గు రాజేశ్‌, జక్కు రమేశ్‌, శరత్‌రెడ్డి, అంచూరి విజయ్‌ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌ పాలన దేశానికే ఆదర్శం



పెద్దవంగర: సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి



తొర్రూరు : వైద్యులను సన్మానిస్తున్న మంత్రి దయాకర్‌రావు

● పంచాయతీరాజ్‌ శాఖ మంత్రి దయాకర్‌రావు

పెద్దవంగర: సీఎం కేసీఆర్‌ పాలన దేశానికే ఆదర్శమని, సీఎం కేసీఆర్‌ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో రాష్ట్రంలో సబ్బండవర్గాల ప్రజలు సుఖ సంతోషాలతో ఉన్నారని రాష్ట్ర పంచాయతీరాజ్‌ శాఖమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని సాయిగార్డెన్‌లో నిర్వహించిన ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్‌ పాలనలో కరెంటు, సాగునీరు, పెట్టుబడులకు రైతులు ఇబ్బందులు పడ్డారని, ఇప్పుడు ఆ గోస తీరి ఆనందంతో ఉన్నారన్నారు. ఈ సంక్షేమ పథకాలతో పాటు ఇప్పుడు బీఆర్‌ఎస్‌ ప్రవేశపెట్టనున్న మేనిఫెస్టోను చూసి ప్రత్యర్థి పార్టీల్లో దడ పుడుతుందన్నారు. బీఆర్‌ఎస్‌ పథకాలు అమలు కావాలంటే కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిని చేసుకుందామని పేర్కొన్నారు. సోమవారం పాలకుర్తి నియోజక వర్గంలో ఐటీ శాఖ మంత్రి కేటీఆర్‌ పర్యటిస్తారని, నాయకులు, కార్యకర్తలు, పెద్ద ఎత్తున స్వాగతం పలికి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ నాయకులు ఐలయ్య, రామచంద్రయ్య శర్మ, సోమనర్సింహారెడ్డి, శ్రీనివాస్‌, యాదగిరి రావు, పాకనాటి సోమారెడ్డి, బొమ్మకల్లు ఎంపీటీసీ రవీందర్‌ నాయక్‌, తదితరులు పాల్గొన్నారు.

వైద్య రంగాన్ని బలోపేతం చేస్తున్న ప్రభుత్వం

తొర్రూరు : వైద్య, ఆరోగ్య రంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం బలోపేతం చేస్తోందని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. బ్రాహ్మణ అఫీషియల్స్‌, ప్రొఫెషనల్స్‌ అసోసియేషన్‌, ప్రైవేట్‌ డాక్టర్‌ అసోసియేషన్ల ఆధ్వర్యంలో శనివారం డివిజన్‌ కేంద్రంలోని ఎల్‌వైఆర్‌ గార్డెన్‌లో మెగాహెల్త్‌ క్యాంపు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆరోగ్యశ్రీ ట్రస్టు చైర్మన్‌ డాక్టర్‌ నెమరుగొమ్ముల సుధాకర్‌రావు, కలెక్టర్‌ శశాంకలతో కలిసి మంత్రి మాట్లాడారు. వైద్య, విద్య పేదలకు అందేలా మెడికల్‌, నర్సింగ్‌ కళాశాలలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ఇప్పటి వరకు 21 వైద్య కళాశాలలు అందుబాటులోకి వచ్చాయన్నారు. తొర్రూరులో 100 పడకల ఆస్పత్రి, పాలకుర్తిలో 50 పడకల ఆస్పత్రి మంజూరయ్యాయని, అతి త్వరలో సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్‌ చైర్మన్‌ మంగళపల్లి రామచంద్రయ్య, ఎంపీపీ తూర్పాటి చిన్న అంజయ్య, పీఏసీఎస్‌ చైర్మన్‌ కాకిరాల హరిప్రసాద్‌, ఆర్టీఏ నర్సింగరావు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మురళీధర్‌, బోప్పా రాష్ట్ర అధ్యక్షుడు డి.రాధాకృష్ణ మూర్తి, ప్రధాన కార్యదర్శి వింజమూరి సుధాకర్‌, వైద్యులు బ్రాహ్మణ ప్రతినిధులు పాల్గొన్నారు.

కేటీఆర్‌ సభ ఏర్పాట్ల పరిశీలన

ఈ నెల 9న తొర్రూరులో పలు అభివృద్ధి పనులకు మంత్రి కేటీఆర్‌ శంకుస్థాపన చేయనున్నారు. ఇందులో భాగంగా తొర్రూరు పాలకేంద్రం సమీపంలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయనున్నారు. ఈ నేపథ్యంలో సభాస్థలిని శనివారం కలెక్టర్‌ శశాంకతో కలిసి మంత్రి ఎర్రబెల్లి పరిశీలించారు. ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలిచ్చారు.

బీసీల అభివృద్ధికి ఎజెండా ప్రకటించాలి



మాట్లాడుతున్న తిరునహరి శేషు

● బీసీ జేఏసీ రాష్ట్ర చైర్మన్‌ తిరునహరి శేషు

హన్మకొండ: బీసీల సమగ్రాభివృద్ధికి రాజకీయ పార్టీలు చేపట్టనున్న ఎజెండా, పార్టీ వైఖరిని ప్రకటించాలని బీసీ జేఏసీ రాష్ట్ర చైర్మన్‌ డాక్టర్‌ తిరునహరి శేషు డిమాండ్‌ చేశారు. శనివారం హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధానంగా మూడు రాజకీయ పార్టీలు బీఆర్‌ఎస్‌, కాంగ్రెస్‌, బీజేపీ.. బీసీల అభివృద్ధి, సంక్షేమంపై స్పష్టమైన విధానం ప్రకటించాలన్నారు. బీసీల అభ్యున్నతికి పార్టీలు తీసుకోవాల్సిన, చేపట్టాల్సిన అంశాలను ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చాలని కోరుతూ కాంగ్రెస్‌ పార్టీకి స్వయంగా ఇవ్వగా.. సీఎం కేసీఆర్‌, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌ రెడ్డికి మెయిల్‌ ద్వారా వినతిపత్రాలు పంపామన్నారు. బీఆర్‌ఎస్‌.. బీసీలకు కేవలం 22 సీట్లలో మాత్రమే అవకాశం కల్పించిందన్నారు. కాంగ్రెస్‌, బీజేపీలైనా ప్రాధాన్యం కల్పించాలని డిమాండ్‌ చేశారు. సమావేశంలో నాయకులు నూతనకంటి ఆనందం, చిన్నాల యశ్వంత్‌, దారబోయిన సతీష్‌, ఐలాపురం వేణుచారి, దాడబోయిన శ్రీనివాస్‌, వంగపండ్ల నరేందర్‌ పాల్గొన్నారు.

ఆర్ట్స్‌ కళాశాలలో గొడవ..

● ఓ విద్యార్థిని చితకబాదిన ఇతర విద్యార్థులు
● పరిస్థితి ఉద్రిక్తం.. ప్రిన్సిపాల్‌ దృష్టికెళ్లిన ఘటన?

కేయూ క్యాంపస్‌ : హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్‌ అండ్‌సైన్స్‌ కళాశాలలో శనివారం సాయంత్రం విద్యార్థుల మధ్య గొడవ జరిగింది. బీఏ మొదటి సంవత్సరం విద్యార్థులకు.. బీఏ ద్వితీయ ,ఫైనల్‌ ఇయర్‌ విద్యార్థులు ఆ కళాశాలలో ఆడిటోరియంలో వెల్‌కమ్‌ పార్టీ నిర్వహించారు. మధ్యాహ్నం 3గంటల వరకు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆ తరువాత చాలా మంది విద్యార్థులు కళాశాల ఆవరణకు చేరుకున్నారు. కొందరు ఫొటోలు దిగుతున్నారు. ఈ సమయంలో ఏమైందో తెలియదుగాని ఓ ఫస్టియర్‌ విద్యార్థిని ద్వితీయ సంవత్సరం విద్యార్థులుగా భావిస్తున్న కొందరు చితకబాదారని సమాచారం. ఆ విద్యార్థిని వెంబడించి మరి చితకబాదారని తెలుస్తోంది. దీంతో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ విషయం తెలుసుకున్న పలువురు అధ్యాపకులు ఘటనాస్థలికి చేరుకుని ఈ గొడవను నిలువరించారని సమాచారం. అనంతరం విద్యార్థులను కళాశాల నుంచి బయటికి పంపారు. కాగా, విద్యార్థిని ఎందుకు చితకబాదారనే విషయం తెలియరాలేదు. ఈ గొడవ విషయంపై ఆ కళాశాల ప్రిన్సిపాల్‌ బన్న ఐలయ్య దృష్టికి కూడా వెళ్లినట్లు సమాచారం. గొడవ పడిన విద్యార్థులను ఈనెల 8న లేదా 9న పిలిపించి మాట్లాడాలని యోచిస్తున్నారని సమాచారం. దీనిపై ప్రిన్సిపాల్‌ ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

కాంట్రాక్టు లెక్చరర్ల నిరసన

● అరెస్టు అప్రజాస్వామికం
● 'కుక్టా' జేఏసీ చైర్మన్‌ కరుణాకర్‌రావు



నిరసన తెలుపుతున్న కాంట్రాక్టు లెక్చరర్లు

కేయూ క్యాంపస్‌: తెలంగాణ రాష్ట్రంలోని 12 యూనివర్సిటీల్లోని కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులరైజ్‌ చేయాలని 'కుక్టా' జేఏసీ చైర్మన్‌ డాక్టర్‌ పి. కరుణాకర్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులరైజ్‌ చేయాలని ఆ కళాశాలలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కరుణాకర్‌రావు మాట్లాడుతూ కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులరైజ్‌ చేస్తామని గతంలో ఇచ్చిన హామీని సీఎం కేసీఆర్‌ నిలబెట్టుకోవాలన్నారు. ఈనెల 6న హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో కాంట్రాక్టు లెక్చరర్లు ఆమరణ దీక్ష చేస్తున్న వారిని అరెస్టు చేయడం అప్రజాస్వామికమన్నారు. కేయూ కుక్టా జేఏసీ నుంచి ఖండిస్తున్నామన్నారు. ప్రభుత్వ జూనియర్‌, డిగ్రీ, పాలిటెక్నిక్‌ కళాశాలల్లోని కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులరైజ్‌ చేసిన మాదిరిగానే యూనివర్సిటీల కాంట్రాక్టు లెక్చరర్లను కూడా రెగ్యులరైజ్‌ చేయాలని డిమాండ్‌ చేశారు. నిరసన కార్యక్రమంలో కుక్టా జేఏసీ బాధ్యులు మాదాసి కనకయ్య, బాధ్యులు ఎల్‌.జితేందర్‌, ఎస్‌.సురేష్‌, ఎ కొమురయ్య, పి.ప్రవీణ్‌కుమార్‌, ఎస్‌.సతీష్‌కుమార్‌, శ్రీధర్‌రావు, ఎ.శ్రీలత, ఆర్‌.మంజుల, సాయికిరణ్‌, తదితరులు పాల్గొన్నారు.

విచారణ కమిటీని స్వాగతిస్తున్నాం

● ఉద్యమకారుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వెంకటనారాయణ

కేయూ క్యాంపస్‌: కాకతీయ యూనివర్సిటీలో పీహెచ్‌డీ అడ్మిషన్ల అవకతవకలపై విచారణ కమిటీని నియమిస్తామని హనుమకొండ పర్యటనకు వచ్చిన రాష్ట్ర పురపాలక, ఐటీశాఖ మంత్రి కేటీఆర్‌ వెల్లడించడాన్ని స్వాగతిస్తున్నామని తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆచార్య కూరపాటి వెంకటనారాయణ తెలిపారు. ఈమేరకు శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేయూలో పీహెచ్‌డీ అడ్మిషన్లలో అవకతవకలు జరిగాయని విద్యార్థి జాక్‌ నాయకులు దీక్షలు కొనసాగిస్తున్నారన్నారు. ఈ క్రమంలో పీహెచ్‌డీ అడ్మిషన్ల అవకతవకలపై విచారణ కమిటీని నియమిస్తామని మంత్రి కేటీఆర్‌ ప్రకటించారన్నారు. అయితే కమిటీని త్వరగా నియమించి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్‌ చేశారు. కాగా, కేయూ పీహెచ్‌డీ అడ్మిషన్లలో జరిగిన అవకతవకలపై విచారణ కమిటీని నియమించి సమస్యను త్వరగా పరిష్కరించి విద్యార్థులకు న్యాయం చేయాలని కేయూ రిటైర్డ్‌ టీచర్స్‌ అసోసియేషన్‌ (కుర్టా) అధ్యక్షుడు సదానందం కోరారు.